క్లుప్తంగా

నేడు తాగునీటి సరఫరాలో అంతరాయం

రామంతాపూర్: హబ్సిగూడ పరిధిలో పైపులైన్ల మరమ్మతు పనుల కారణంగా బుధవారం రామంతాపూర్‌తో పాటు హబ్సిగూడలోని హరిజన బస్తీ, పీఎన్‌టీ కాలనీలకు తాగునీటి సరఫరా ఉండదని డీజీఎం రజనీకాంత్‌రెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు.

వారాంతపు సంత

అల్వాల్ సర్కిల్ పరిధిలోని అల్వాల్ గ్రంథాలయం వద్ద బుధవారం వారాంతపు సంత (రైతుబజార్) నిర్వహిస్తారు.

వైద్య సేవలు
అల్వాల్, మల్కాజిగిరి, మౌలాలి ప్రభుత్వ ఆస్పత్రుల్లో బుధవారం గర్భిణుల నమోదు, చికిత్సలు, జనరల్ పరీక్షలు, హోమియో వైద్యం నిర్వహిస్తారు.

విద్యార్థులకు ఉచిత శిక్షణ

బోడుప్పల్: సహస్ర అకాడమీ ఆధ్వర్యంలో 3వ తరగతి నుంచి 10వ తరగతి విద్యార్థులకు ఉచిత శిక్షణ కోర్సులు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు కె. నరేష్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. స్పీడ్ మ్యాథ్స్, మ్యాథ్స్ బేసిక్స్, స్పోకెన్ ఇంగ్లీష్, తెలుగు, హిందీ బేసిక్స్ నేర్పుతామన్నారు. రిజిస్ట్రేషన్, ఇతర సమాచారం కొరకు 9966923404, 9052249033 నంబర్లలో సంప్రదించాలన్నారు.

వేసవి శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేయాలి

మల్కాజిగిరి: వార్డుల వారీగా చిన్నారుల కోసం వేసవి శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేయాలని మల్కాజిగిరి డివిజన్ కార్పొరేటర్ శ్రవణ్ అన్నారు. ఈ మేరకు మంగళవారం జీహెచ్‌ఎంసీ స్పోర్ట్స్ విభాగం అడిషనల్ కమిషనర్ విజయలక్ష్మిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి శిబిరాలను నిర్వహిస్తూ కోచ్‌లను ఏర్పాటు చేయాలని కోరామన్నారు. ఇందుకుగాను ప్రత్యేకంగా నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు.

డ్రైనేజీ సమస్య పరిష్కారంలో అధికారులు విఫలం


ఈదమ్మ గుడి వద్ద మురుగు నీటిని చూపిస్తున్న ఎస్వీ కిట్టు

మల్లాపూర్: ఓల్డ్ మల్లాపూర్‌లో ఈదమ్మ దేవాలయం వద్ద డ్రైనేజీ పొంగి పొర్లుతున్న డ్రైనేజీ సమస్యను పరిష్కరించడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారని బీజేపీ నేత ఎస్వీ కిట్టు ఆరోపించారు. మంగళవారం ఆయన ఈదమ్మ గుడి వద్ద స్థానికులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. ఓల్డ్ విలేజ్‌లోని పలు గల్లీల్లో తాగునీరు కలుషితమవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని సమస్యను పరిష్కరించాలని కోరారు.

దోమల బెడదను నివారించండి



మౌలాలి: వినాయక్‌నగర్ డివిజన్ పరిధిలో దోమల కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని కార్పొరేటర్ క్యానం రాజ్యలక్ష్మి అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆమె సమస్యను పరిష్కరించాలని కోరుతూ మల్కాజిగిరి సర్కిల్ డీసీకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ వినాయక్‌నగర్ డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో దోమల బెడద తీవ్రంగా ఉందన్నారు. ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారని, డెంగ్యూ, మలేరియాతో బాధపడుతున్నట్లు తెలిపారు. డివిజన్ పరిధిలో రెండు చెరువులు పూర్తిగా కలుషితమయ్యాన్నారు. చెరువులను శుభ్రపర్చడం, మురుగునీటి మళ్లింపు, సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతిరోజు కాలనీల్లో ఫాగింగ్ చేపట్టాలని కోరారు.

నర్సరీలను పరిశీలించిన అడిషనల్ కలెక్టర్ అగస్త్య

మేడ్చల్: మున్సిపాలిటీ ఆధ్వర్యంలో మేడ్చల్ పట్టణంలో నిర్వహిస్తున్న నర్సరీలను జిల్లా స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ అభిషేక్ అగస్త్య మంగళవారం పరిశీలించారు. అత్వెల్లి, మేడ్చల్ రైల్వే కాలనీల్లో ఉన్న నర్సరీలను ఆయన పరిశీలించి తగు సూచనలు చేశారు. నర్సరీల నిర్వహణ, ఏ రకాల మొక్కలను పెంచుతున్నారు? మొక్కల పెరుగుద ల.. వాటి నిర్వహణ వంటి విషయాలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వేము ల రాములు, ఎన్విరాన్మెంట్ ఏఈ జ్ఞానాశ్వర్, సిబ్బ ంది ప్రియాంక, యాదగిరి తదితరులు ఉన్నారు.

ధాన్యం సేకరణకు సిద్ధం

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో యాసంగి వరి ధాన్యం కొనేందుకు యంత్రాంగం కసరత్తు

- 30 వేల మెట్రిక్ టన్నులు కొనడమే లక్ష్యం
- 11 కేంద్రాల ద్వారా ధాన్యం సేకరణకు ఏర్పాట్లు పూర్తి
- రైతులకు అన్ని వసతులు, సరిపడా గన్నీ బ్యాగులు



సాక్షి,మేడ్చల్ జిల్లా: యాసంగిలో రైతు పండించిన వరి ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అధికార యంత్రాంగం సిద్ధమవుతోంది. ప్రభుత్వం నిర్ణయంలో భాగంగా కలెక్టర్ అమయ్‌కుమార్ ఆదేశాల మేరకు జిల్లాలో 11 కేంద్రాల ద్వారా ఏప్రిల్ రెండో వారం నుంచి ధాన్యం సేకరించేందుకు జిల్లా పౌర సరఫరాల శాఖ చర్యలు తీసుకుంటోంది. యాసంగిలో సాధారణ వరిపంట సాగు విస్తీర్ణం 10,454 ఎకరాలు కాగా, రైతులు 13,015 ఎకరాల్లో వరి పంట వేశారు. దీంతో వరి పంట దిగుబడి 33 వేల మెట్రిక్ టన్నులు రాగలదని జిల్లా వ్యవసాయ శాఖ అంచనా వేస్తోంది. రైతులను అన్ని విధాలుగా ఆదుకోవడంతో పాటు పండించిన వరి ధాన్యానికి కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరతో కొనుగోలు చేసేందుకు జిల్లా పౌర సరఫరాల శాఖ కసరత్తు చేస్తోంది. వరి ధాన్యం గ్రేడ్-ఏ క్వింటాల్ ధర రూ.2060, కామన్ గ్రేడ్ క్వింటాల్ ధర రూ.2040గా ఖరీదు చేసేందుకు కార్యాచరణ రూపొందించారు. ధాన్యం సేకరణలో భాగంగా కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని వసతులు కల్పిస్తున్నారు. ఎండాకాలం కావడంతో ధాన్యం సేకరణ కేంద్రాల్లో తాగునీటి వసతితో పాటు షామియానాలు ఏర్పాటు చేయాలని యంత్రాంగం ఆదేశించింది.

7.50 లక్షల గన్నీ బ్యాగులు..

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 11 కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరించటానికి 7.50 లక్షల గన్నీ బ్యాగులు అవసరమని జిల్లా పౌర సరఫరాల శాఖ అంచనా వేసినప్పటికీ లెక్కకు మించి 8.80 లక్షల గన్నీ బ్యాగులు అందుబాటులో ఉన్నట్లు అధికార యంత్రాంగం తెలిపింది. అలాగే టార్పాలిన్లు, తేమ యంత్రాలు, పాడి క్లీనర్లు, కాంటాలు తదితర అవసరమైన వాటిని కూడా అందుబాటులో ఉంచినట్లు పేర్కొంది.

ధాన్యం సేకరణ కేంద్రాలివే..

జిల్లాలో 11 కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం సేకరణ చేయాలని అధికార యంత్రాంగం నిర్ణయించింది. ప్రతాపసింగారం, ఎదులాబాద్, మాదారం 9 ఘట్కేసర్ మండలం), కేశవరం, లక్ష్మాపూర్, ఉద్దమర్రి (మూడు చింతలపల్లి మండలం), మేడ్చల్, డబుల్‌పూరా, పూడూరు (మేడ్చల్ మండలం), శామీర్పేట్, కీసరలలో ధాన్యం సేకరణ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు.

దళారులను ఆశ్రయించొద్దు

జిల్లాలోని 11 ధాన్యం సేకరణ కేంద్రాల ద్వారా ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరతో వరి ధాన్యం కొనుగోళ్లకు ఏర్పాట్లు చేస్తున్నాం. ఈ మేరకు సంబంధిత అధికారులు, సిబ్బందితో ఏర్పాట్లపై సమావేశాన్ని నిర్వహించాం. ధాన్యం క్రయవిక్రయాలకు సంబంధించి దళారులను ఆశ్రయించొద్దు. వ్యవసాయ శాఖ విస్తరణాధికారులు గ్రామాల్లో క్షేత్ర స్థాయిలో పర్యటించి ధాన్యం కొనుగోళ్లకు సంబంధించిన పూర్తి డేటాను సేకరిస్తారు. తహసీల్దార్లు ధాన్యం సేకరణ కేంద్రాలను పర్యవేక్షించి తగిన చర్యలు తీసుకుంటారు.
– రాజేందర్, మేనేజర్, పౌర సరఫరాల శాఖ, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా

గతంలో సేకరణ ఇలా...

- 2020-21 యాసంగిలో 11 కొనుగోలు కేంద్రాల నుంచి 5,743 మంది రైతుల ద్వారా 28,615 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరతో కొనుగోలు చేశారు.
- 2021-22 యాసంగిలో జిల్లాలోని 11 ధాన్యం సేకరణ కేంద్రాల ద్వారా ప్రభుత్వం ప్రకటించిన మద్దతుతో 17 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి


అధికారులతో చర్చిస్తున్న మేయర్ బుచ్చిరెడ్డి

బోడుప్పల్: నగర పాలక సంస్థ పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని బోడుప్పల్ మేయర్ సామల బుచ్చిరెడ్డి అన్నారు. మంగళవారం ఆయన అధికారులతో కలిసి నిర్మాణ దశలో ఉన్న వెజ్, నాన్‌వెజ్ మార్కెట్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పనుల్లో జాప్యం జరగకుండా చూడాలన్నారు. ఎన్నికల కోడ్ కారణంగా కొత్త పనులు చేపట్టలేకపోయినట్లు తెలిపారు. అనంతరం చెత్త డంపింగ్ యార్డును పరిశీలించారు. హరిత హారంలో లక్షల మొక్కలు నాటుతున్నామని వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. 13వ డివిజన్ కార్పొరేటర్ దానగల్ల అనిత యాదగిరితో కలిసి హరిత హారం, శ్మశాన వాటికను పరిశీలించారు. కార్యక్రమంలో మేనేజర్ మంజులత, డీఈఈ శారద, ఆర్ఐ వెంకటేశ్వర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ జాన్‌పాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కుక్కల పట్ల అప్రమత్తంగా ఉండాలి


మాట్లాడుతున్న డిప్యూటీ కమిషనర్ శంకర్

కుషాయిగూడ: వీధి కుక్కల పట్ల అప్రమత్తంగా ఉండాలని కాప్రా సర్కిల్ డిప్యూటీ కమిషనర్ శంకర్ అన్నారు. మంగళవారం కుషాయిగూడ కూరగాయాల మార్కెట్ ఆవరణలో వీధి కుక్కల నియంత్రణపై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ నగరంలో గత కొద్ది రోజులుగా ప్రజలపై కుక్కల దాడులు పెరిగిపోయాయన్నారు.ఈ నేపథ్యంలో కాలనీల్లో వీధి కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. గుంపులు గుంపులుగా కనిపిస్తే అధికారులకు సమాచారం అందజేయాలన్నారు. పిల్లలను బయటకు పంపే ముందు తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. కుక్క కరిస్తే వెంటనే సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి వైద్యం చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో శానిటేషన్ సిబ్బంది నాగరాజు, రాజన్, లక్ష్మీ, మార్కెట్ అధ్యక్షుడు నందగిరి లక్ష్మీనారాయణ, వెంకటేష్ గుప్త తదితరులు పాల్గొన్నారు.

మేరు కులస్తుల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలి

ఉప్పల్: మేరు కులస్తుల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని మేరు కులస్తుల సంక్షేమ సంఘం నాయకులు అన్నారు. ఈ మేరకు వారి సంక్షేమం కోసం ప్రభుత్వం విడుదల చేసిన జీఓను అమలు చేయాలని కోరుతూ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఉప్పల్ ఎంఈఓకు వినతి పత్రం అందజేశారు. ఇటీవల ప్రభుత్వం జారీ చేసిన జీఓ ప్రకారం ప్రభుత్వ పాఠశాలకు సరఫరా చేసే యూనిఫాం ఆర్డర్‌ను 30 శాతం మేరు కులస్తులకే ఇవ్వాలని కోరారు. జీఓ అమలు చేయని పక్షంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు రుద్రంగి కరుణాకర్, ప్రధాన కార్యదర్శి కర్నె మల్లేష్, సింగ్ విష్ణు,, మునిగాల రాము, కొత్తకొండ మహేష్ పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

ఉప్పల్: తెలుగుదేశం పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలని టీడీపీ మల్కాజిగిరి పార్లమెంట్ అబ్జర్వర్ కందికంటి అశోక్‌కుమార్ గౌడ్ అన్నారు. మంగళవారం చిలుకానగర్ డివిజన్ అధ్యక్షుడు పబ్బతి శేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన ఇంటింటికి తెలుగు దేశం కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా చిలుకానగర్ న్యూరాంనగర్, ఆదర్శనగర్, కుమ్మరి కుంట తదితర కాలనీల్లో పర్యటించి తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో చేపట్టిన అభివృద్ధి పనులను వివరించారు. కార్యక్రమంలో తిరునగరి జ్యోత్స్న, ఉప్పల్ డివిజన్ అధ్యక్షులు తిక్క ప్రకాశ్, అశోక్, రాములు యాదవ్, గిరి బాబు, శ్రీరాం మల్లేష్, గుడిసెల మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ పనులు పూర్తి చేయాలి


కాలనీల్లో పర్యటిస్తున్న కార్పొరేటర్ తదితరులు

ఉప్పల్: డివిజన్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలని ఉప్పల్ కార్పొరేటర్ మందముల రజిత పరమేశ్వర్‌రెడ్డి అధికారులను కోరారు. మంగళవారం ఆమె జలమండలి, జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి లక్ష్మీనారాయణ కాలనీ, ఉప్పల్ బస్టాండ్ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికంగా నెలకొన్న సమస్యలపై స్థానికులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ పెండింగ్ పనులు వెంటనే పూర్తి చేయాలని అధికారులను కోరారు. ఫిర్యాదులపై వెంటనే స్పందించాలన్నారు. ఉప్పల్ బస్టాండ్ వెనక సీసీ రోడ్డు తవ్వి వదిలేయడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే పనులను పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో పరమేశ్వర్‌రెడ్డి, జలమండలి జీఎం సంతోష్, జీహెచ్‌ఎంసీ ఏఈ వసంత, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

మేడిపల్లి: మేడిపల్లి పీఅండ్‌టీ కాలనీ 33 కేవీ సబ్‌స్టేషన్ విద్యుత్ ఫీడర్ పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపు పనులు చేపట్టనున్న నేపథ్యంలో బుధవారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తున్నట్లు మేడిపల్లి విద్యుత్ ఏఈ ప్రదీప్ కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కారణంగా పీఅండ్‌టీ కాలనీ విద్యుత్ ఫీడర్ పరిధిలోని పలు కాలనీల్లో విద్యుత్ సరఫరా అంతరాయం ఏర్పడుతుందన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

నూతన కార్యవర్గం ఏర్పాటు

మల్లాపూర్: నాచారం-తార్నాక నాయీ బ్రాహ్మణ సంఘం నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా నడిగొట్టు బాలకృష్ణ, ఉపాధ్యక్షులుగా మంగళి రవి, ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు, సంయుక్త కార్యదర్శులుగా శ్రీకాంత్, నరేష్, కోశాధికారిగా రమేష్, కిరణ్, కమిటీ సభ్యులుగా స్వామి, రమేష్, నరేష్, శ్రీనివాస్, స్వామి, విఠల్, నాగరాజు, శ్రీనివాస్, యాకన్న, ప్రకాష్, ఎన్నికయ్యారు.

6 పాజిటివ్ కేసులు నమోదు

మల్కాజిగిరి: మల్కాజిగిరి జిల్లా కేంద్ర ఆస్పత్రిలో మంగళవారం 37 మందికి కోవిడ్ పరీక్షలు నిర్వహించారు. ఆరుగురికి పాజిటివ్‌గా నిర్ధారణ అయినట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ప్రసాద్ తెలిపారు.

మొల్లమాంబకు నివాళి


నివాళులు అర్పించిన కుమ్మరి సంఘం నాయకులు

మల్కాజిగిరి: మల్కాజిగిరి కుమ్మరి సంఘం ఆధ్వర్యంలో కవయిత్రి ఆతుకూరి మొల్ల(మొల్లబాంబ) జయంతి సందర్భంగా మంగళవారం ఆమె చిత్రపటం వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షుడు బాలబుచ్చాల్, అధ్యక్షుడు రాములు ,లక్ష్మణ్, కుమార్, కోటేశ్వరరావు, అశోక్, రమణ పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యం


గౌతమ్‌సాయి (ఫైల్)

అల్వాల్: ఇంట్లో నుంచి బయటికి వెళ్లిన యువకుడు అదృశ్యమైన సంఘటన నేరేడ్‌మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. దమ్మాయిగూడ ఇందిరమ్మకాలనీ, వాయుశక్తినగర్‌కు చెందిన గౌతమ్‌సాయి ఈనెల 12న నేరేడ్‌మెట్, జేకే కాలనీలో ఉంటున్న తన అక్క ఇంటికి వచ్చాడు. అనంతరం స్నేహితులను కలిసేందుకు వెళ్తున్నట్లు చెప్పి బయటికి వెళ్లాడు. సాయంత్రం అతను తిరిగి రాకపోవడంతో కుటుంబసభ్యులు గాలింపు చేపట్టారు. గౌతమ్‌సాయి ఆచూకీ తెలియకపోవడంతో అతడి తండ్రి శ్రీశైలం మంగళవారం నేరేడ్‌మెట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సమస్యల పరిష్కారంలో ప్రభుత్వాలు విఫలం


మౌలాలిలో కొనసాగుతున్న కాంగ్రెస్ జోడో యాత్ర

మౌలాలి: ప్రజా సమస్యల పరిష్కారంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు నందికంటి శ్రీధర్ అన్నారు. మంగళవారం ఆయన చేపట్టిన జోడో యాత్ర మౌలాలి చౌరస్తా, హనుమాన్‌నగర్ ప్రాంతాల్లో కొనసాగింది. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ మల్కాజిగిరి నియోజకవర్గంలో సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయన్నారు. కాంగ్రెస్ పేదల పార్టీ అని, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు వంశీముదిరాజ్, వినోద్‌యాదవ్, ఉమామహేశ్వరి యాదవ్, శ్రీనివాస్‌గౌడ్, రామచందర్, సంతోష్ ముదిరాజ్, శంకర్, మహేందర్‌గౌడ్, హమీద్ భాయ్, అరుణ్, కిరణ్, హైదర్, రహీముద్దీన్, శ్యామ్, సత్యనారాయణ, అలీ, జాన్, మదర్, సలీం, బాకర్, రవి, జయరాం, నాగరాజుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

చిలుకానగర్‌లో విషాద ఛాయలు

ఉప్పల్: యాదాద్రి జిల్లా భువనగిరి, వంగపల్లి వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో చిలుకానగర్ ప్రాంతానికి చెందిన తండ్రీ కొడుకులు మృతి చెందడంతో ఆ ప్రాంతంలో తీవ్ర విషాదం నెలకొంది. పెద్ది రమేష్(38) అతని కుమారుడు అభిలాష్(14) మృతదేహాలు మంగళవారం చిలుకానగర్‌కు చేరుకున్నాయి. ఉప్పల్ సర్కిల్ ఏ- బ్లాక్ అధ్యక్షుడు మందముల పరమేశ్వర్‌రెడ్డి భౌతిక కాయాలను సందర్శించి నివాళులర్పించారు. మృతుల కుటుంబ సభ్యులను ఓదార్చి వారికి అండగా ఉంటామని భరోసా కల్పించారు.


నివాళులర్పిస్తున్న పరమేశ్వర్‌రెడ్డి తదితరులు

ఐవీఎఫ్ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడిగా పాండయ్య



నియామకపత్రం అందజేస్తున్న దృశ్యం

రామంతాపూర్: ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడిగా రామంతాపూర్‌కు చెందిన సంబు పాండయ్య నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా, ఐవీఎఫ్ సెంట్రల్ వర్కింగ్ ప్రెసిడెంట్ గంజి రాజమౌళి గుప్తా మంగళవారం ఆయనకు నియామక పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఐవీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి రమేష్, భువనగిరి శ్రవణ్, నాగేష్ పాల్గొన్నారు.

బీఎల్‌ఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆర్థికసాయం


ఆర్థికసాయం అందజేస్తున్న మహేష్‌గౌడ్ తదితరులు..

కుషాయిగూడ: అగ్ని ప్రమాదం కారణంగా ఉపాధి కోల్పోయిన చిరు వ్యాపారులకు బీఎల్‌ఆర్ ట్రస్టు అండగా నిలిచింది. పడాల రమేష్, కనకలక్ష్మి దంపతులు చక్రిపురం చౌరస్తాలో షెడ్డు ఏర్పాటు చేసుకుని భోజనాలు అమ్ముకుంటూ జీవనం సాగించేవారు. ఇటీవల ప్రమాదవశాత్తు షెడ్డు కాలిపోవడంతో దిక్కుతోచని స్థితిలో ఉన్న వారికి బీఎల్‌ఆర్ ట్రస్టు అండగా నిలిచింది. ట్రస్టు ప్రతినిధి నేమూరి మహేష్‌గౌడ్ మంగళవారం బాధితులకు రూ.10 వేలు ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రస్టు చైర్మన్ బండారి లక్ష్మారెడ్డి ఆదేశాల మేరకు ఆర్థికసాయం అందజేసినట్లు తెలిపారు. ఆపదలో ఉన్నవారికి బీఎల్‌ఆర్ ట్రస్టు అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు సీతారాంరెడ్డి, కనకయ్య, కరణ్, ముకేష్ తదితరులు పాల్గొన్నారు.

నీటి ఎద్దడి నివారణకు ప్రత్యేక చర్యలు


కాలనీల్లో పర్యటిస్తున్న కార్పొరేటర్ వెంకటేశ్‌యాదవ్

బోడుప్పల్: డివిజన్ పరిధిలో తాగునీటి సమస్య నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు 23వ డివిజన్ కార్పొరేటర్ రాసాల వెంకటేశ్‌యాదవ్ అన్నారు. మంగళవారం ఆయన వాటర్ వర్క్స్ డీజీఎం శ్రీనివాస్‌రెడ్డి, మేనేజర్ మమతతో కలిసి డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో పర్యటించి నీటి సమస్యను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ కాలనీలో నీటి ఎద్దడి కారణంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు కాలనీవాసులు తమ దృష్టికి తీసుకొచ్చారన్నారు. సంబంధిత అధికారులతో చర్చించి అన్ని కాలనీలకు రోజు విడిచి రోజు నీటిని సరఫరా చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కాలనీవాసులు మిట్టపల్లి సురేందర్‌రెడ్డి, అలీ, రాజ్‌కుమార్, ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, నామాల రవి, నాగరాజు, ప్రవీణ్, సుదర్శన్, రాజేందర్ పాల్గొన్నారు.

సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కోవాలి



బహుమతులను అందజేస్తున్న జోనల్ కమిషనర్ పంకజ

ఉప్పల్: మహిళలు నిత్య జీవితంలో ఎదురయ్యే సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కోవాలని ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ పంకజ అన్నారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉప్పల్ జీహెచ్‌ఎంసీ గ్రౌండ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన ఆటల పోటీల కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నేటి మహిళ అత్యంత శక్తి వంతమైనదని అన్నిరంగాల్లోనూ మహిళలకు ప్రాధాన్యం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఉప్పల్ సర్కిల్ డీసీ అరుణ కుమారి, ప్రాజెక్టు అధికారి రమాదేవి, చందన, మౌనిక, శైలజ, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలతోనే సంతృప్తి

అల్వాల్: సేవా కార్యక్రమాలతో ఎంతో సంతృప్తి కలుగుతుందని నర్ల సేవా సమితి వ్యవస్థాపకులు నర్ల సురేష్ అన్నారు. మంగళవారం మచ్చబొల్లారంలో నర్ల సేవా సమితి ఆధ్వర్యంలో రూ. 6 లక్షలతో కొనుగోలు చేసిన అంతిమయాత్ర వాహనాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ తమ తల్లిదండ్రుల జ్ఞాపకార్థం ఉచితంగా అంతిమయాత్ర వాహనాన్ని అందుబాటులో ఉంచుతున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతానన్నారు. కార్యక్రమంలో టీఆర్‌ఎస్ నాయకుల బొబ్బిలి సురేందర్‌రెడ్డి, అశోక్, రాజయ్య, అంజిరెడ్డి, ధనరాజ్, శ్రీరాములు, బాలష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.


వాహనాన్ని ప్రారంభిస్తున్న నర్ల సురేష్

'కంటి వెలుగు' ను సద్వినియోగం చేసుకోవాలి


పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

మల్లాపూర్: నాచారం ఓల్డ్ విలేజ్‌లోని సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ భవన్‌లో ఏర్పాటు చేసిన 'కంటి వెలుగు' కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సీనియర్ సిటిజన్స్ అధ్యక్షులు ప్రేమ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి సాయి బాబా అన్నారు. గత నాలుగు రోజులు కంటి వెలుగు కార్యక్రమం కొనసాగుతుందన్నారు. వైద్యులు పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి కళ్ల అద్దాలను అందజేస్తున్నటు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ ఫిరదౌస్, ఫాతీమా, ఆప్టోమెట్రిస్ట్ పద్మావతి, ప్రమీల, ప్రకాష్, అసోసియేషన్ సభ్యులు శ్రీశైలం, పాండురంగం, నాగేశ్వర్‌రావు, యాదగిరి, ఎల్లేష్, రాజు తదితరులు ఉన్నారు.